క్లుప్తంగా

చిరంజీవిపై బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు



బాపట్ల: ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవిపై నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో చేసిన వ్యంగ్య పూర్వక వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, అసెంబ్లీ సాక్షిగా చిరంజీవికి క్షమాపణలు చెప్పాలని, చిరంజీవి యువత ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణుమొలకల చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం బాపట్లలోని తన స్వగృహంలో జరిగిన అభిమానుల సమావేశంలో డిమాండ్ చేశారు. చిరంజీవి తన సినీ, రాజకీయ జీవితంలో ప్రజల కోసం, సినీ పరిశ్రమ కోసం, తనను సాయం కోరి వచ్చిన వారి కోసం నేనున్నానంటూ ఒక హితుడిగా సాయం చేసే మనస్సు ఉన్న నాయకుడని అన్నారు. బాలకృష్ణ ఇకనైనా తన వక్రబుద్ధిని మార్చుకోవాలని హితవు పలికారు.

మూల్పూరులో ఉచిత కంటి వైద్య శిబిరం



అమర్తలూరు(వేమూరు): పేద ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించడం జరుగుతుందని డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామంలో యువ జన సంఘం ఆధ్వర్యంలో దళితవాడ చర్చిలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విజయవాడకు చెందిన మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ వారు ఈ శిబిరం నిర్వహించారు. 250 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించామని, 150 మందికి కళ్లజోళ్లు అందజేసినట్లు డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. 50 మంది రోగులకు కంటి శుక్లాల ఆపరేషన్‌కు రిఫర్ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, క్యాంప్ కో ఆర్డినేటర్ మునీశ్వర్, కన్వీనర్ కె.ప్రియాంక పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిచటం అభినందనీయమని నియోజకవర్గ టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ లన్నారు. మండలంలోని గుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యజ్ఞహాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి మండలం నలుమూలల నుంచి వచ్చిన 200 మందికి యజ్ఞ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బెల్లంకొండ శ్రీకాంత్, డాక్టర్ మాధవి, డాక్టర్ పవన్ కుమార్‌లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగు సూచనలు అందించారు.

అ'పూర్వ' కలయిక



బాపట్లటౌన్: మండలంలోని కొండుబోట్లవారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1992-93 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 32 సంవత్సరాల తర్వాత చదువుల గుడిలో ఆదివారం ఏకమయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ కలయికతో కేబీపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలుసుకొని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. అదే బ్యాచ్‌కి చెందిన రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పూర్వ విద్యార్థుల సమ్మేళన సభ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో పెరిగిపోతున్న గడ్డిని తొలగించేందుకు పూర్వ విద్యార్థుల తరఫున పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభానికి గడ్డి కోత మిషన్ (గ్రాస్ హార్వెస్టర్)ను అందించారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

స్వచ్ఛందంగా సేవ చేద్దాం



కర్లపాలెం: మానవత సంస్థ ద్వారా సమాజంలో స్వచ్ఛందంగా సేవ చేద్దామని ఆ సంస్థ అధ్యక్షుడు తూనుగుంట్ల వెంకట సుబ్బారావు తెలిపారు. మానవత సంస్థ సభ్యుల సమావేశం ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా ఉచితంగా ఇచ్చేందుకు మార్చురీ బాక్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, సభ్యులు శ్రీనివాసరెడ్డి, సాంబయ్య, బాలాజీరెడ్డి, బాలాజీ తదితరులు ఉన్నారు.

ఆయుష్ పోయరూ..!

- శిథిలావస్థలో భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాల
- ఆక్రమణలకు గురైన వైద్యశాల స్థలం
- గతంలో వందలాది మంది రోగులకు సేవలు
- నేడు వైద్యసిబ్బంది లేక ఇక్కట్లు



శిథిలావస్థకు చేరిన భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాల, ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

భట్టిప్రోలు: భట్టిప్రోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఒకప్పుడు పాత రేపల్లె తాలూకా పరిధిలో ఈ భట్టిప్రోలు వైద్యశాల ఒకటిగా వెలుగొందింది. 86 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వైద్యశాలకు దాదాపు చుట్టుపక్కల ఐదారు మండలాల నుంచి వందలాది మంది రోగులు వస్తుండేవారు. 32 సెంట్ల విస్తీర్ణం గల ఆయుర్వేద వైద్యశాల స్థలం వెనుక భాగంలో ఉన్న 6 సెంట్లు ఆక్రమణలకు గురైంది. వైద్యశాల ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండి డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో బయటకు వెళ్లే మార్గం లేక పరిసర ప్రాంతాల్లో మురుగు స్తంభించిపోయి రోగాలకు నిలయంగా మారింది. ఇక వైద్యశాల బూత్ బంగ్లాను తలపిస్తుంది. వైద్యశాల భవనం పగుళ్లిచ్చి నేడో రేపో కూలేందుకు సిద్ధంగా ఉంది. ఫ్లోరింగ్ కుంగిపోయి, కిటికీలు, తలుపులు ఊడిపోయాయి. రూఫింగ్ మొత్తం బీటలు వారడంతో వర్షం వస్తే నిలబడటానికి వీలు లేకుండా ఉంది. సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వైద్యశాలకు తాళాలు వేసి ఉంటున్నాయి. సమీపంలోని వారు గేటుపై దుస్తులు ఆరవేసుకుంటున్నారు.



వైద్యశాల గేటుపై దుస్తులు ఆరవేసిన దృశ్యం

వైద్యశాల అభివృద్ధికి గ్రహణం

ప్రస్తుతం ఈ వైద్యశాలలో పని చేస్తున్న ఎంఎన్‌ఓ కాంపౌండర్ డెప్యూటేషన్‌పై కొల్లూరు, వేమూరు మండలాల్లోని గ్రామాలైన క్రాప, జంపని ఆయుర్వేద వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆయుర్వేద వైద్యశాలకు ఇన్‌చార్జిగా క్రాప వైద్యాధికారి జి.నాగసుధ వ్యవహరిస్తున్నారు. ఈ వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్, ఎఫ్ ఎంఓ, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో పని చేసిన వైద్యాధికారి రిటైర్ అయిన నాటి నుంచి ఈ వైద్యశాలకు గ్రహణం పట్టింది.

పూర్వ వైభవం వచ్చేనా?

గత ఏడాది ఆయుష్ శాఖ కమిషనర్ రాజేంద్ర స్థానిక ఆయుర్వేద వైద్యశాల భవనాన్ని పరిశీలించి సకల హంగులు, అత్యాధునిక వసతులతో నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. కానీ అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఆయుష్ శాఖకు ఈ ఏడాది రూ.80 కోట్ల బడ్జెట్ కేటాయించడంతో భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాలకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని గ్రామ వాసులు ఆకాంక్షిస్తున్నారు.



మైదానంలో గ్రాసం.. క్రీడలకు దూరం

కొల్లూరు: విద్యార్థుల మానసిక ఉల్లాసానికి దోహదపడే ఆటలు, వ్యాయామం వారికి అందని ద్రాక్షలా మారాయి. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి అవసరమైన క్రీడా మైదానం నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా తయారైంది. కొల్లూరు బాలుర, బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఆటలలో రాణించేందుకు విశాలమైన క్రీడా మైదానం పాఠశాల ప్రాంగణాలను ఆనుకొని ఉంది. అయితే మైదానం మొత్తం పల్లంగా తయారవడంతో వర్షాపు నీరు, పంట కాలువ నీరు మైదానంలోకి చేరి నీటితో నిండి ఉంటంతో విద్యార్థులకు అందుబాటులో లేకుండాపోయింది. 6 నుంచి 10వ తరగతి వరకు ఇరు పాఠశాలల్లోని వందలాది మంది విద్యార్థులు నీటి నిల్వతో ఏపుగా పెరిగిన గడ్డి కారణంగా దాదాపు నాలుగు నెలలుగా ఆటలకు దూరమయ్యారు. విద్యార్థులతోపాటు, రోజువారి వాకింగ్, రన్నింగ్ చేసుకునే గ్రామంలోని ఇతరులు సైతం క్రీడా మైదానం అందుబాటులో లేకపోవడంతో నిరుత్సాహంతో రహదారుల వెంబడి మొక్కుబడి వాకింగ్‌తో సరిపెడుతున్నారు. క్రీడా మైదానం పచ్చని పసిరికతో కూడిన గడ్డితో నిండి ఉండటంతో సర్పాలు, ఇతర విష కీటకాలకు నిలయంగా మారింది. పల్లంగా మారిన క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తే గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానికులలో వ్యక్తమవుతుంది.

భగత్‌సింగ్‌కు నివాళి



బాపట్ల: పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసి భగత్‌సింగ్ అమరుడయ్యారని ఫోరం ఫర్ బెటర్, బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. ఆదివారం ఫోరం ఫర్ బెటర్, బాపట్ల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా మండల కార్యాలయం వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సి.సాయిబాబు మాట్లాడుతూ భగత్‌సింగ్ భారతీయ పౌరుషానికి ప్రతీక, ప్రజలలో తిరుగుబాటు స్ఫూహను కలిగించారని గుర్తు చేసుకున్నారు. ఆయన రుణం భారతదేశం ఎన్నటికీ తీర్చుకోలేదని, విప్లవ మార్గాన్ని ఎంచుకొని, అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, న్యాయవాది జమ్రుడ్ బాషా, ఘంటసాల వెంకటేశ్వర రెడ్డి, ఘంటసాల సినీ నిర్మాత రామారావు, పల్లపోలు లోహియా తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఆరోగ్యం, పేద విద్యార్థులకు వైద్య విద్య అందించాలనే సంకల్పంతో ఎక్కడా లేని విధంగా రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకువస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గుళ్ళపల్లి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీన బాపట్లలోని అంబేడ్కర్ విగ్రహం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నియోజకవర్గంలోని ఎస్సీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంకుశంగా అవలంబిస్తున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల రాష్ట్రంలో ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు. దీంతో పేద విద్యార్థులకు వైద్య విద్య కలగానే మిగిలిపోతుందని గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిని అని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రంలో ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీ అయినా తీసుకువచ్చారా అని.. మెడికల్ కళాశాలల గురించి మాట్లాడే అర్హత ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సుమారు రూ.8,500 కోట్లతో ఏకంగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఇప్పటికైనా మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయకుండా ప్రభుత్వమే కొనసాగించాలని లేని పక్షంలో పార్టీ పరంగా పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని గణేష్ హెచ్చరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర జయింట్ సెక్రటరీ చిత్రాల ఓబేదు మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పేదల పట్ల వివక్ష, కార్పొరేట్ సంస్థల పట్ల మమకారం చూపుతూనే ఉన్నదని అందుకు ఉదాహరణ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయడమేనన్నారు. చంద్రబాబు దళితులను అవమాన పరిచే విధంగా దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ దళితుల పట్ల నీచంగా మాట్లాడిన దళిత ద్రోహి అని మండిపడ్డారు. కావున ఈ నెల 30న బాపట్లలో జరిగే నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఎస్సీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ గణష్, ఓబేదులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి నీలం వీరేంద్ర, రేపల్లె మండల కన్వీనర్ మేడికొండ అనిల్, చెరుకుపల్లి కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ నాయకులు సముద్రాల ప్రభుకిరణ్, గాలిమోటు రాజశేఖర్, చిలిగె సువర్ణరాజు, కొత్తపల్లి రమేష్, గంద్రపాటి సురేష్, నీలా నాంచారయ్య, గుండాల కాంతారావు, అలివేలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



నగరం: వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. మండలంలోని చినమట్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అలిబుడ్డా తండ్రి మహబూబ్ షరీఫ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ గణేష్ ఆదివారం మహబూబ్ షరీఫ్ మృతదేహన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా నగరం గ్రామానికి చెందిన తాడికొండ రాము తల్లి సత్యవతి మృతి చెందడంతో సత్యవతి మృతదేహన్ని సందర్శించి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ కోటేశ్వరరావు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డి.కొండల రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్‌వలి, రాజశేఖర్, సుభాని, కొండలరెడ్డి, షాబుద్దీన్, ఖాదర్ ఖాన్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు గ్రామంలో పేదలకు నిత్యావరాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన విన్సెంట్ డి పాల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమాన్ని చేపట్టారు. నిత్యావసరాలను అందజేసి అన్నదానంం చేశారు. కార్యక్రమంలో ఫాదర్ ఇమ్మానియేల్, రాజమోహన్, పి.బాల్స్వామి, పొన్నెకంటి సామియేలు, సిరిపురం బాలస్వామి, ఎస్.రవిబాబు పాల్గొన్నారు.



సరస్వతీదేవిగా జిల్లెళ్ళమూడి అమ్మవారు



రాజీవ్‌గాంధీకాలనీలో మహాచండి అలంకారంలో...



పాపిరెడ్డిపాలెంలో మహాలక్ష్మి అలంకరణలో దుర్గమ్మ



కోటిపల్లి సోమశేఖరాలయంలో బాలాత్రిపురసుందరిగా...



చెరుకుపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...



కనగాలలో మహాచండీదేవిగా...



కొలగానివారిపాలెంలో మహాచండీదేవిగా...



గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో...

కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

బాపట్లటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జిల్లెళ్ళమూడి గ్రామంలో వెంచేసియున్న అనసూయదేవి అమ్మవారు ఆదివారం సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతి అలంకారంలో ఉన్న అమ్మవారిని జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల విద్యార్థులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విశ్వజనని పరిషత్ ట్రెజరర్ జేఎల్‌పీ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఓరియంటల్ కళాశాలలో ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు అమ్మ స్థాపించిన కళాశాలలో 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచితంగా తెలుగు, సంస్కృత భాషలలో డిగ్రీ వరకు చదువుకో వచ్చన్నారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో సనాతన హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు మహాచండిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొల్లూరు: దసరా నవరాత్రి మహోత్సవాలు మండలంలోని పలు ఆలయాల్లో అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ప్రత్యేక అలంకారాలలో దర్శనమిస్తున్న అమ్మవారిని భక్తులు దర్శించుకొని భక్తి పారవశ్యంలో మునిగి తేలుతున్నారు. మండలంలోని కోటిపల్లి సత్య జ్ఞాన ప్రసూనాంబ సమేత సోమశేఖర స్వామి ఆలయంలో 7వ రోజు పూజలలో భాగంగా అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లూరు పార్వతి సమేత అనంత భోగేశ్వరాలయంలో, వైష్ణవీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాస్య కూచిపూడి నాట్యాలయానికి చెందిన జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. దసరా పూజలలో భాగంగా మండలంలోని ఆవులవారిపాలెం రామాలయంలో నిర్వహిస్తున్న మహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెరుకుపల్లి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఆదివారం భక్తులు అమ్మవార్లను పెద్ద ఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు. సందర్భంగా చెరుకుపల్లి గ్రామంలో ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి మహాచండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి మహిళలు లలితాసహస్ర నామ పారాయణ చేశారు. అదేవిధంగా మండలంలోని గుళ్ళపల్లి, కనగాలలోని ఆలయాల్లో అమ్మవారిని మహాచండీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు.

నగరం: దపరా శరన్నవరాత్రి మహోత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారి విగ్రహాలకు మహాచండీదేవిగా అలంకారం చేశారు. మండలంలోని కొలగానివారిపాలెం, పూడివాడ,నగరం, మీసాలవారిపాలెం గ్రామాలలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం అమ్మవారు మహాచండి అలంకారంలో దర్శనమిచ్చారు. పూజ కార్యక్రమాల్లో స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ, శ్రీధర శర్మ, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వాలేశ్వరస్వామి దేవస్థానంలో...

వేమూరు: వేమూరు మండలంలోని చావలి వాలేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి లలితాదేవిగా అలంకారం చేశారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కర్లపాలెం: దేవి శరన్నవరాత్రులలో ఏడవ రోజు మహాలక్ష్మి అలంకారంలో దుర్గమ్మ పూజలందుకున్నారు. మండల కేంద్రంలోని కాళికాంబ ఆలయం, పెద్దింటమ్మ ఆలయం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీనివాసుని కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాపిరెడ్డిపాలెం, ఆట్లవారిపాలెం, కొత్తనందాయపాలెం గ్రామాల్లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో కనకదుర్గ సమేత రామచౌడేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం చండీయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో పాలాభిషేకం సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. చినపరిమి గ్రామంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో దసరా మహోత్సవాలలో భాగంగా ఆదివారం పార్వతీదేకి చండీదేవిగా అలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వలివేరు గ్రామంలో గౌడపాలెం వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం అమ్మవారికి లలితాదేవిగా అలంకారం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వలివేరు గ్రామంలో...



చినపరిమి రామలింగేశ్వర ఆలయంలో...



కనకదుర్గ సమేత రామచౌడేశ్వర దేవస్థానంలో...

విశ్వనరుడు జాషువా సేవ పురస్కారం అందజేత

భట్టిప్రోలు(వేమూరు): గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని మేధావులకు అవార్డులు అందజేయడం జరిగిందని ముట్లూరు వెంకయ్య తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ హాల్లో గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని ఆదివారం విశ్వనరుడు గుర్రం జాషువా సేవాసాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామమోహనరావు దంపతులను సత్కరించి అవార్డు అందజేశారు. వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలంలోని పెదలంక గ్రామానికి చెందిన చిలుమూరు రామమోహనరావుకు జాషువా సామాజిక సేవ పురస్కారాన్ని అందజేశారు. సీఆర్ఆర్ఎస్ అండ్ ఎంకేఆర్ఎస్ ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సాహిత్య, సామాజిక సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్కా సురేష్‌బాబు, డీఈవో కిరణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఏపీవోఎస్ఎస్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు, ఆరుంబాక ప్రకాశ్‌రావు, పుష్పాంజలి, అభిలాష్ ప్రసాద్, చారీష్, శిరీష, వీరమ్మ, యేసురత్నం పాల్గొన్నారు.



జాషువా సేవ పురస్కారం అందుకున్న రామమోహనరావు

ఘనంగా జాషువా జయంతి



బాపట్లటౌన్: ఆధునిక తెలుగు కవులలో గుర్రం జాషువాది ప్రముఖ స్థానమని అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ తెలిపారు. గుర్రం జాషువా జయంతి వేడుకలను ఆదివారం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ మాట్లాడుతూ సామాజిక ప్రయోజనం కోసం జాషువా రచనలు చేసారని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డారని అన్నారు. ప్రఖ్యాతిగాంచిన ఆధునిక తెలుగు కవుల్లో జాషువా ఒకరన్నారు. తన కవిత్వం ద్వారా మూఢాచారాలపై తిరగబడి ఛీత్కారాలు పొందిన చోటే సత్కారాలు చేయించుకున్నారని తెలిపారు. తన కవితల ద్వారా సాంఘిక సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని రగిలించాడన్నారు.గణపవరం మాజీ సర్పంచ్ కత్తి దానియేలు, నక్కా ప్రకాష్, గవిని ప్రసాద్, కర్నెటి ఏడుకొండలు, నర్రా కొండలు, దయరావు, పాపయ్య,శివ పాల్గొన్నారు.